సాక్షి
ఖమ్మం
శనివారం । 14 । డిసెంబర్ । 2024



సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమైన జమిలీ ఎన్నికలను తాము వ్యతిరేకిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని వెల్లడించారు. 8లో



దండుపాళ్యం తరహాలోనే..

నేలకొండపల్లిలో వృద్ధులైన దంపతులను హత్య చేసిన కేసులో ఎనిమిది మంది ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం
29° / 15°

వాతావరణం

జిల్లాలో శనివారం రోజంతా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి వేళ చలి ప్రభావం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేడు, రేపు డిప్యూటీ సీఎం పర్యటన

మధిర: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శని, ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. డిప్యూటీ సీఎం శనివారం ఉదయం బోనకల్ మండలం ముష్టికుంట్లలో రహదారులను ప్రారంభించాక బోనకల్‌లోని టీజీబీసీఆర్ ఐఈఎస్ స్కూల్‌ను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేస్తారు. ఆతర్వాత బోనకల్, చింతకాని మండలాల్లో వివిధ గ్రామాల్లో రహదారులు, అంగన్‌వాడీ భవనాలు, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అలాగే, ఆదివారం ఉదయం మధిరలో డ్రెయిన్లు, ఫుట్‌పాత్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనుండగా, అక్కడి నుంచి ముదిగొండ మండలం వీ.వీ.కిష్టాపురం చేరుకుని ఆతర్వాత హైదరాబాద్ బయలుదేరతారు.

కేజీబీవీల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఈఓ శ్రీనివాసరావు

ఖమ్మం సహకారనగర్: కేజీబీవీల సిబ్బంది సమ్మె నేపథ్యాన విద్యార్థినులకు ఇబ్బంది ఎదురుకాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు ఇన్‌చార్జ్ డీఈఓ చావా శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలోని ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, రఘునాథపాలెం కేజీబీవీలను శుక్రవారం ఆయన సీఎంఓ రాజశేఖర్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ బోధన సిబ్బంది సమ్మెలో ఉన్నందున సమీపంలోని ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులను కేజీబీవీలకు రొటేషన్ విధానంలో పంపిస్తున్నట్లు తెలిపారు. ఆతర్వాత ఆయన కేజీబీవీల్లో భోజనం నాణ్యతను పరిశీలించడమే కాక తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ కేజీబీవీల్లో బియ్యం నిల్వలు లేకపోవడంతో పౌరసరఫరాల శాఖ అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో ఆయా మండలాల ఎంఈఓలు పాల్గొన్నారు.

సీఎంఆర్ సేకరణ ప్రారంభం



వైరాలో సీఎంఆర్ లోడ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన ధాన్యం కొనుగోళ్లు పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యాన ముమ్మరంగా సాగుతున్నాయి. ఇదే సమయంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించగా అక్కడ మర ఆడించి సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్)గా పౌరసరఫరాల శాఖకు అప్పగిస్తున్నారు. ఈనేపథ్యాన శుక్రవారం మిల్లర్లు 290 క్వింటాళ్ల సీఎంఆర్ అప్పగించగా వైరాలో ఏఎంసీ గోదాంలో భద్రపరిచినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ తెలిపారు. త్వరలోనే రేషన్‌షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అధికారులు సీఎంఆర్ సేకరణపై దృష్టి సారించారు. కాగా, జిల్లాలో 16,858మంది రైతులు ఇప్పటివరకు 10,32,859క్వింటాళ్ల ధాన్యాన్ని విక్రయించగా వారి ఖాతాల్లో రూ.51,64,29,400 జమ అయిందని డీఎస్‌ఓ తెలిపారు.

పోలవరం ముంపుపై ఉన్నత స్థాయి కమిటీ వేయండి



లోక్‌సభలో మాట్లాడుతున్న ఎంపీ

ఖమ్మంవన్‌టౌన్: ఏపీలో గోదావరిపై నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టుతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాపై తీవ్ర ప్రభావం పడనున్నందున సమస్య పరిష్కారానికి ఉన్నత స్థాయి కమిటీ వేయాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి కోరారు. లోక్‌సభలో శుక్రవారం ఈ విషయాన్ని ప్రస్తావించిన ఆయన కేంద్ర జలశక్తి మంత్రికి విన్నవించారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రభావంతో భద్రాద్రి జిల్లాలోని బూర్గంపాడు, అశ్వాపురం, దుమ్ముగూడెం మండలాల్లోని అనేక ప్రాంతాలు, వ్యవసాయ భూములు మునిగిపోతాయని తెలిపారు. దాదాపు 1,090 ఎకరాలను స్థానికులు కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. కాగా, గోదావరి వరదల నుంచి భద్రాచలం, పరిసర ప్రాంతాలను రక్షించేందుకు గతంలోనే అడ్డుకట్టలను నిర్మించగా, ఇటీవలి అదనపు వరద కట్టల నిర్మాణానికి రూ.4,100 కోట్లను తెలంగాణ ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. ఈమేరకు పోలవరం ప్రాజెక్టు ప్రభావంతో ఎదురుకానున్న సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని నియమించాలని ఎంపీ కోరారు.

ముక్కోటి పనులు షురూ



ఉత్తర ద్వారం వద్ద పంచ రంగులు వేస్తున్న కార్మికులు

రూ.60 లక్షల నిధులతో భక్తులకు సౌకర్యాలు

- ఈ నెల 31 నుంచి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు
- ఇప్పటికే సెక్టార్ టికెట్ల విక్రయాలు ఆన్‌లైన్‌లో ప్రారంభం

భద్రాచలం: భూలోక వైకుంఠంగా భావించే భద్రాచలంలో ముక్కోటి ఏకాదశి పనులు ప్రారంభమయ్యాయి. దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీరామనవమితో పాటు ఈ వేడుకలను కూడా ప్రధాన ఉత్సవాలుగా భావిస్తారు. ఈ నెల 31 నుంచి అధ్యయనోత్సవాలు ప్రారంభం కానుండగా జనవరి 9 వరకు పగటి పూట జరిగే (పగల్‌పత్తు)సేవలు జరుపుతారు. జనవరి 10 నుంచి 20 వరకు రాత్రి పూట జరిగే (రాపత్తు) సేవలు, 21 నుంచి 23 వరకు విలాసోత్సవాలు నిర్వహించనున్నారు. భద్రాచలం దేవస్థానంలో మాత్రమే ప్రత్యేకంగా జరిగే విశ్వరూప సేవ జనవరి 26న నిర్వహించనున్నారు. భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఇప్పటికే సమీక్ష సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. దీంతో అధికారులు పనులు ప్రారంభించారు. కాగా ముక్కోటి ఉత్సవాల నేపథ్యంలో ఈ నెల 31 నుంచి జనవరి 10 వరకు బేడా మండపంలో స్వామివారి నిత్యకల్యాణాలు రద్దు చేయనున్నారు.

రూ.52,59,170 నిధులతో టెండర్లు

ముక్కోటి ఉత్సవాలను అంగరంగ వైభవోపేతంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఉత్సవ ఏర్పాట్లపై ఈఓ ఎల్.రమాదేవి దృష్టి సారించారు. రూ.52,59,170 నిధులకు సంబంధించిన పనులకు కాంట్రాక్టర్లకు టెండర్లు కేటాయించారు. ఆలయం, పర్ణశాల, గోదావరి ఘాట్‌ల వద్ద పెయింట్ పనులు, గోపురం, నిత్యకల్యాణ మండపం, వైకుంఠ ద్వారం, గోశాలలకు పంచ రంగులు, చలువ పందిళ్ల నిర్మాణం, భద్రాచలంలో మూడు వైపులా స్వాగత ద్వారాలు, పూల డెకరేషన్ తదితర పనులు ఇందులో ఉన్నాయి. వీటిలో పంచరంగుల పనులు ఇప్పటికే ప్రారంభం కాగా, ఇతర పనులు ప్రారంభం కావాల్సి ఉంది. తెప్పోత్సవం రోజున స్వామి వారు గోదావరిలో విహరించే హంస వాహనం అలంకరణ పనులు, ట్రయల్ రన్‌లను పూర్తి చేయాల్సి ఉంది.

రోజుకో అవతారం.. భద్రాద్రిలో ప్రత్యేకం

ముక్కోటి ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా జరిగే పగల్ పత్తు ఉత్సవాల్లో స్వామివారు రోజుకో అవతారంలో దర్శనమివ్వడం భద్రాచలంలోనే ప్రత్యేకత. విశేషంగా అలంకరించిన స్వామివారిని మిథిలా స్టేడియంలో ఏర్పాటు చేసిన వేదికపై కొలువుదీర్చి భక్తులకు దర్శనం కల్పిస్తారు. అవతారాల అనంతరం రోజుకో ప్రభుత్వ శాఖ ఆధ్వర్యంలో రాపత్తు సేవలు నిర్వహిస్తారు.

ముక్కోటి పనులు వేగంగా పూర్తి చేస్తాం



ముక్కోటి పనులు వేగంగా పూర్తి చేస్తాం. ఇప్పటికే టెండర్ల ప్రక్రియను పూర్తి చేయగా, వీటిలో కొన్ని పనులు ప్రారంభమయ్యాయి. భక్తులకు ఇబ్బందులు లేకుండా, ప్రశాంతంగా ఉత్తర ద్వార దర్శనం చేసుకునే విధంగా ఏర్పాట్లు చేస్తాం. ఈ ఏడాది త్వరగానే భక్తుల కోసం ఆన్‌లైన్‌లో టికెట్ల విక్రయం చేపట్టాం.

– ఎల్ రమాదేవి, ఈఓ, రామాలయం

మొదలైన టికెట్ల విక్రయం

ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకోవాలనుకునే భక్తులకు వివిధ సెక్టార్ల టికెట్ల విక్రయం బుధవారమే ప్రారంభమైంది. రూ. 250, రూ.500, రూ.1,000, రూ.2వేల విలువైన టికెట్లను భక్తులకు అందుబాటులో ఉంచారు. ఇక ప్రత్యక్షంగా ఉత్తర ద్వార దర్శనం చేసుకోలేని భక్తులకు పరోక్ష సేవలను సైతం ఆన్‌లైన్‌లో ఉంచారు. ఇందుకోసం రూ.2 వేల విలువైన టికెట్లను విక్రయానికి ఉంచారు. గతేడాది ఈ టికెట్ల విక్రయం ద్వారానే స్వామి వారికి అధిక ఆదాయం సమకూరింది. టికెట్లను www:// bhadradritemple. telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న భక్తులు ఈ నెల 25 నుంచి వచ్చే నెల 10వ తేదీ ఉదయం 5గంటల వరకు తానీషా కల్యాణ మండపంలోని సీఆర్‌ఓ కార్యాలయంలో టికెట్లు పొందవచ్చని ఆలయ అధికారులు తెలిపారు.

సొంతింటి కల నిజం చేస్తాం



నమూనా ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి, పక్కన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్ తదితరులు

- నాలుగేళ్లలో 20లక్షల గృహాల నిర్మాణమే లక్ష్యం
- మోడల్ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి

కూసుమంచి: రాష్ట్రంలో ప్రతీ పేదవాడికి సొంతింటి కలను తమ ప్రభుత్వం నిజం చేస్తుందని, ఇందులో భాగంగా రానున్న నాలుగేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ గృహాలను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. కూసుమంచిలో నిర్మించనున్న మోడల్ ఇంటి నిర్మాణానికి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్‌తో కలిసి మంత్రి భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ గృహాల కోసం ప్రజాపాలన సభల్లో 80 లక్షల దరఖాస్తులు అందగా సిబ్బంది సర్వే చేస్తూ యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారన్నారు. ఆతర్వాత అర్హులను విడతల వారీగా ఎంపిక చేసి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల చొప్పున మంజూరు చేస్తామని తెలిపారు. ఈ నిధులతో ఇల్లు నిర్మించుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించేందుకు మోడల్ గృహాలు సిద్ధం చేస్తున్నామన్నారు. కాగా, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారు, దరఖాస్తు చేసుకుని మరణించిన వారి కుటుంబీకులు తిరిగి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తామని, విడతల వారీగా ఇళ్లు మంజూరు చేయనున్నందున అర్హులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గత ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు గృహ ప్రవేశానికి ముందే దెబ్బ తిన్నందున తాము అలా జరగకుండా చూస్తామని మంత్రి స్పష్టం చేశారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో ఇళ్ల కోసం 3.5లక్షల దరఖాస్తులు రాగా సర్వే కొనసాగుతోందని తెలిపారు. అన్ని మండల కేంద్రాల్లో నమూనా గృహాలు నిర్మించి మేస్త్రీలకు శిక్షణ ఇవ్వడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. మార్కెట్ చైర్మన్లు వెన్నపూసల సీతారాములు, బైరు హరినాథ్‌బాబు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, ఆర్డీఓ నర్సింహారావు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలత, ఈఈలు శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, తహసీల్దార్ కరుణశ్రీ, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు. ఎంపీడీఓ కుమార్, ఎంపీఓ రాజారావు, తహసీల్దార్ పి.రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్న తమది పేదల ప్రభుత్వమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని కొక్కిరేణి, బీరోలు, సుబ్లేడు, పాతర్లపాడుల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల పనులకు ఆయన శంకుస్థాపన చేయడంతో పాటు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. ఆర్డీఓ నర్సింహారావు తహసీల్దార్ పీ.వీ.రామకృష్ణ, ఎంపీడీఓ సిలార్‌సాహెబ్‌తో పాటు శ్రీనివాస్, రామసహాయం నరేష్‌రెడ్డి, చావా శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్.. సత్వర, శాశ్వత న్యాయం

- రాజీ పడదగిన కేసుల పరిష్కారమే లక్ష్యం
- కక్షిదారులకు డబ్బు, సమయం ఆదా
- గత రెండేళ్లలో 71,324 కేసుల్లో తీర్పు



లోక్ అదాలత్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాజగోపాల్ (ఫైల్)

ఖమ్మంలీగల్: కోర్టు కేసుల పరిష్కారంలో జాప్యాన్ని నివారించి.. కక్షిదారులకు సత్వర న్యాయం, శాశ్వత పరిష్కారం అందించడమే లక్ష్యంగా లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నారు. కోర్టుల్లో కేసుల సంఖ్య పెరిగిపోతున్న నేపథ్యాన ఉన్నత న్యాయస్థానం ప్రత్యామ్నాయ మార్గంగా లోక్ అదాలత్‌ను ప్రవేశపెట్టింది. అలాగే, కాలయాపన లేకుండా కేసులను పరిష్కరించడానికి న్యాయ సేవాధికార చట్టాన్ని రూపొందించారు. దీంతో కక్షిదారుల విలువైన సమయం, డబ్బు వృథా కాకుండా చూస్తూనే శాశ్వత, అంతిమ పరిష్కారాన్ని ఈ లోక్ అదాలత్‌లు అందిస్తున్నాయి.

న్యాయసాయం కోసం చట్టం

ప్రభుత్వం 1987లో న్యాయసేవాధికార చట్టాన్ని ప్రవేశపెట్టింది. కేవలం డబ్బు ఉన్న వారికే న్యాయం సొంతమనే అపోహను తొలగించేందుకు రాజ్యాంగంలోని 39వ అధికరణ ద్వారా ఈ చట్టాన్ని తీసుకొచ్చింది. పేదలకు న్యాయ సాయం అందించేందుకు న్యాయ విజ్ఞాన సదస్సులు, కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తూ చట్టం, న్యాయం వివరాలు తెలియక ఇబ్బంది పడే సామాన్యులకు అవగాహన కల్పించి సత్వరన్యాయం అందించడమే లక్ష్యంగా లోక్‌అదాలత్‌లు నిర్వహిస్తున్నారు. ఇందులో న్యాయసేవాధికార చట్టం కీలకంగా ఉంటోంది.

ప్రత్యామ్నాయ పరిష్కారం

దేశంలో 'ప్రత్యామ్నాయ పరిష్కార పద్ధతి' సూత్రాన్ని అనుసరించి ప్రభుత్వం ప్రజా న్యాయపీఠం(లోక్ అదాలత్) ను చట్టరీత్యా ప్రవేశపెట్టారు. న్యాయ సేవాధికార సంస్థల చట్టంలోని 9వ అధికరణ ప్రకారం న్యాయపరమైన సమస్యపై ఉభయులకు నచ్చచెప్పి వారి సమ్మతితో శాశ్వత పరిష్కారం చూపిస్తారు. ఈ సమయాన ఎలాంటి బలవంతం ఉండదు. ఎవరైనా ఆర్థిక, ఇతర కారణాలతో న్యాయాన్ని పొందే అవకాశాన్ని కోల్పోకుండా చూసేందుకు ఉచిత న్యాయసాయం సైతం అందిస్తున్నారు.

న్యాయసూత్రాల సహకారంతో..

లోక్ అదాలత్‌కు వచ్చే ప్రతీ కేసులో ఉభయవర్గాల మధ్య రాజీ కుదిర్చి.. తగాదా పరిష్కరించాల్సి ఉంటుంది. ఇందుకోసం లోక్‌అదాలత్‌లు మనస్ఫూర్తిగా, శాయశక్తులా ప్రయత్నించాలి. ఇదేసమయాన బలవంతం చేయడం, భయపెట్టడం, వాగ్దానాలు చేయడం, మభ్య పెట్టడం వంటివి చేయొద్దు. కాగా, లోక్ అదాలత్‌లో జారీ చేసిన అవార్డు తుది తీర్పు కావడమే కాక కేసులో చెల్లించిన కోర్టు ఫీజు తిరిగి పొందే అవకాశముంది. సమస్య లేక దావా పరిష్కారమైతే రాజీ షరతులు పొందుపరుస్తూ అవార్డు జారీ చేస్తారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్

జిల్లా కోర్టు ఆవరణలో శనివారం న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఇప్పటికే పలుమార్లు పోలీస్ అధికారులు, న్యాయవాదులు, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ముందస్తుగా కేసులు పరిష్కరించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ చొరవతో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా ప్రణాళిక రూపొందించారు. కాగా, శనివారం లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం కోసం తొమ్మిది బెంచీలు ఏర్పాటు చేశారు. మూడో అదనపు జిల్లా జడ్జి రాంప్రసాదరావు, న్యాయమూర్తులు ఎం.కల్పన, కె.దీప, బి.రజని, వై.బిందు ప్రియ, వి.మాధవి, ఆర్.శాంతిలత ఈ బెంచ్‌లకు నేతృత్వం వహించనున్నారు.

గత ఏడాది, ఈ ఏడాది ఇప్పటివరకు లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించిన కేసులు

లోక్‌అదాలత్	పరిష్కారమైన కేసులు
ఫిబ్రవరి 2023	8,046
సెప్టెంబర్ 2023	17,718
జూన్ 2023	7,880
డిసెంబర్ 2023	19,303
మార్చి 2024	7,665
జూన్ 2024	10,712
మొత్తం	71,324

స్వర్ణ కవచధారుడిగా రామయ్య

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారి మూలమూర్తులు స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతీ శుక్రవారం స్వామివారిని స్వర్ణ కవచాలతో అలంకరిస్తారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి స్వామిని దర్శించుకున్నారు. ఈఓ రమాదేవి ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా, అర్చకులు విజయరాఘవన్ తదితరులు వేదాశీర్వచనం చేశారు.

ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా చేపట్టాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి, పక్కన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, వివిధ శాఖల అధికారులు

ఖమ్మంసహకారనగర్: ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని అధికారులు పారదర్శకంగా నిర్వహించాలని, ప్రతీ దశలో పార్టీల ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఓటర్ల సవరణ జాబితాపై ఆయన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఉన్న తప్పొప్పులను సవరించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. మార్పులు, చేర్పులపై వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాకే పరిష్కరించాలని సూచించారు. అలాగే, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, స్థానం, పేరు మార్పిడిపై పార్టీల ప్రతినిధులతో సంప్రదించాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ 12,27,230 మంది ఓటర్లతో ముసాయిదా రూపొందించగా, ఐదు కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించామని తెలిపారు. దీనిపై 21,277 దరఖాస్తులు అందగా 18వేలకు పైగా పరిష్కరించామని చెప్పారు. అలాగే, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు 4,605 దరఖాస్తు అందగా ఇప్పటివరకు 3,899 ఆమోదించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, డీఆర్వో రాజేశ్వరి పాల్గొన్నారు.

గ్రూప్–2 నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు

జిల్లాలో గ్రూప్–2 పరీక్షలు పారదర్శకంగా నిర్వహించేలా ఏర్పాట్లుచేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పరీక్షల ఏర్పాట్లపై ఆయన అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 28,101 మంది అభ్యర్థుల కోసం 85 కేంద్రాలు ఏర్పాటుచేయగా 15, 16వ తేదీల్లో ఉదయం 10నుంచి 12–30వరకు, మధ్యాహ్నం 3నుంచి 5–30గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. ప్రతీ అభ్యర్థికి ప్రత్యేకంగా ఓఎంఆర్ షీట్లు సిద్ధం చేసినందున అభ్యర్థి హాజరైనా, లేకున్నా ఆ స్థానంలో ఓఎంఆర్ షీట్ పెట్టాలని సూచించారు. అభ్యర్థులను ఉదయం 8–30 నుంచి 9–30గంటల వరకు, మధ్యాహ్నం 1–30 నుంచి 2–30గంటల వరకే అనుమతించి ఆతర్వాత గేట్లు మూసివేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రీజినల్ కోఆర్డినేటర్లు డాక్టర్ వి.చిన్నయ్య, డాక్టర్ జి.రాజ్‌కుమార్, డీఆర్వో రాజేశ్వరి, కలెక్టరేట్ ఏఓ అరుణ పాల్గొన్నారు.

వసతి గృహాల్లో ఉత్సవాలు

నేటి నుంచి అన్ని హాస్టళ్లలో ఒకే మెనూ

- పెంచిన డైట్, కాస్మొటిక్ చార్జీలు కూడా..
- పాల్గొననున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



తల్లిదండ్రుల సమక్షాన వంటలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ఖమ్మం మయూరిసెంటర్/నేలకొండపల్లి: సంక్షేమ శాఖల వసతి గృహాల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా డైట్ చార్జీలు 40శాతం పెంచడమే కాక కాస్మొటిక్ చార్జీలనూ పెంచుతూ ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. పెంచిన డైట్ చార్జీల ఆధారంగా అన్ని హాస్టళ్లలో ఒకే విధమైన మెనూ శనివారం నుంచి అమలు చేయనున్నారు. ఈకార్యక్రమాన్ని పండగలా నిర్వహించేందుకు అన్ని హాస్టళ్లు, గురుకులాలకు ప్రత్యేక అధికారులను నియమించారు. ఈమేరకు వసతిగృహాల్లో నిర్వహించే ఉత్సవాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు హాజరుకావాలని ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యాన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాలోని వేర్వేరు హాస్టళ్లలో పాల్గొననున్నారు.

179 హాస్టళ్లకు ప్రత్యేకాధికారులు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఉత్సవాలకు ఏర్పాట్లు చేయడంతో పాటు పర్యవేక్షణకు ప్రతీ వసతి గృహానికి ప్రత్యేకాధికారిని నియమించింది. జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ, మైనార్టీ, గిరిజన సంక్షేమ గురుకులాలు, హాస్టళ్లు 179 ఉండగా.. వీటిన్నింట్లో శనివారం నుంచి కొత్త మెనూ అమలుకానుంది. అలాగే, గతంలో మాదిరి శాఖల వారీగా కాకుండా అన్నిచోట్ల ఒకే మెనూ ఆధారంగా విద్యార్థులకు భోజనం సమకూరుస్తారు. కాగా, ఎనిమిదేళ్లుగా డైట్ చార్జీలు పెంచకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదనే విమర్శలు వచ్చాయి. దీంతో రాష్ట్రప్రభుత్వం గత నెలలో 40 శాతం మేర మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలను 16ఏళ్ల తర్వాత 200 శాతం పెంచింది. డైట్ చార్జీలను 3 నుంచి 7వ తరగతి విద్యార్థులకు రూ.950 నుంచి రూ.1,330కు, 8నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.1,100 నుంచి రూ.1,540 కు, ఇంటర్ నుంచి పీజీ విద్యార్థులకు రూ.1,500 నుంచి రూ.2,100కు పెంచారు. అలాగే, కాస్మొటిక్ చార్జీలు బాలికలకు 7వ తరగతి వరకు రూ.55 నుంచి రూ.175కు, 11ఏళ్ల వయస్సు పైన బాలికలకు రూ.75 నుంచి రూ.275కు, బాలురు 7వ తరగతి వరకు రూ.62 నుంచి రూ.150కు, 11ఏళ్ల వయస్సు కంటే ఎక్కువ ఉన్న వారికి రూ.62 నుంచి రూ.200కు పెంచగా ఇవి శనివారం నుంచి అమలుకానున్నాయి.

ఎవరెవరు ఎక్కడెక్కడ

బోనకల్‌లోని బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలో శనివారం 'కామన్ డైట్ లంచ్'ను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రారంభిస్తారు. ఆయన వెంట కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఖమ్మం ఆర్డీఓ పాల్గొంటారు. అలాగే, తిరుమలాయపాలెం మండలం మాదిరిపురంలోని గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలలో కార్యక్రమాన్ని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, ప్రత్యేక అధికారి రమేష్ హాజరవుతారు.

తల్లిదండ్రులకు ఆహ్వానం

రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభిస్తున్న కామన్ డైట్ మెనూ లంచ్ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులను సైతం ఆహ్వానించారు. తమ పిల్లలు చదువుతున్న హాస్టళ్లు, గురుకులాలకు తల్లిదండ్రులు హాజరుకావాలని అధికారులు ఇప్పటికే సమాచారాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా త్వరలో నిర్మించే యంగ్ ఇండియా సమీకృత గురుకులాల ప్రత్యేకతలను తల్లిదండ్రులకు వివరిస్తారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



ప్రభుత్వ ఆదేశాల మేరకు జోనల్ పరిధిలోని అన్ని గురుకులాల్లో ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు సైతం ఆహ్వానం పంపించాం. మారిన మెనూ ఆధారంగా తల్లిదండ్రులు, విద్యార్థులతో కలిసి ప్రజాప్రతినిధులు భోజనం చేస్తారు. అలాగే, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నాం.

– కె.స్వరూపారాణి, గురుకులాల జోనల్ ఆఫీసర్, ఖమ్మం

దండుపాళ్యం ముఠా తరహాలోనే..

కర్ణాటకలో జరిగిన యథార్థ ఘటనల ఆధారంగా తీసిన దండుపాళ్యం సినిమాలో మహిళలు, పురుషులు ఎనిమిది మంది ముఠాగా ఏర్పడతారు. బాగా డబ్బు ఉన్న ఒంటరి వృద్ధులు, మహిళలను ఎంచుకుని వారిని మహిళలు మాటల్లో పెడుతుండగా పురుషులు లోపలికి దూసుకొచ్చి ఇంట్లో ఉన్న వారిని హతమార్చి బంగారం, డబ్బు దోచుకెళ్తుంటారు. ఈ సినిమాను చూసి స్ఫూర్తి పొందారో ఏమో కానీ నేలకొండపల్లిలో గతనెల 26వ తేదీన వృద్ధ దంపతులు ఎర్ర వెంకటరమణ, కృష్ణకుమారిని ఇదే తరహాలో ఓ ముఠా హతమార్చింది. వీరెవరికీ పరిచయం లేకపోగా ఒకరి నుంచి ఒకరు కలుస్తూ ముఠాగా ఏర్పడి దోపిడీకి పథకం పన్నారు. కానీ దంపతులు ముందు జాగ్రత్తగా ఇంట్లో పెద్దగా నగదు, ఆభరణాలు ఉంచకపోవడంతో ముఠాకు నిరాశ ఎదురైనా ఇద్దరిని హతమార్చగా... బృందాలుగా ఏర్పడిన పోలీసులు ఫోన్ కాల్‌డేటా ఆధారంగా అరెస్ట్ చేశారు. ఈమేరకు నిందితుల వివరాలను పోలీసు కమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం వెల్లడించారు. – ఖమ్మంక్రైం



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీపీ సునీల్‌దత్, పక్కన ఏసీపీ, సీఐ, ఎస్సైలు

వృద్ధుల వద్ద దోపిడీకి ఆరు నెలలుగా పథకం

- మచ్చిక చేసుకుని దంపతులను హతమార్చిన ముఠా
- నేలకొండపల్లి హత్య కేసులో ఎనిమిది మంది అరెస్ట్
- వివరాలు వెల్లడించిన పోలీసు కమిషనర్ సునీల్‌దత్

జీవిత ఖైదు.. పెరోల్‌పై బయటకు

ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం ముగూలూరుకు చెందిన షేక్ ఆబిద్ అలియాస్ అబియాద్ అలీ 2011 ఏడాదిలో ఒకరిని హత్య చేసి బంగారం, డబ్బు ఎత్తుకెళ్లాడు. ఈకేసులో జీవిత ఖైదు శిక్ష పడింది. దీంతో రాజమండ్రి సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తూ పెరోల్‌పై బయటకు వచ్చిన ఆబిద్ మళ్లీ జైలుకు వెళ్లకుండా తిరుగుతున్నాడు. అనంతరం కోదాడలో గది అద్దెకు తీసుకుని సోహైల్‌గా పేరు మార్చుకుని అప్పుడప్పుడు కూలీకి వెళ్తుండేవాడు. ఆయన ఇంటి ఎదురుగా ఉన్న భర్త లేని షేక్ హుస్సేన్‌బీతో పరిచయం పెంచుకోగా అది వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఆపై చిలుకూరు మండలం నారాయణపురానికి చెందిన చిట్టిప్రోలు సురేష్(గే)తో మరోపేరుతో పరిచయం చేసుకుని ఆయనతోనూ అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. అనంతరం హైదరాబాద్‌లో ట్యాక్సీ నడిపే జగ్గయ్యపేటకు చెందిన స్నేహితుడు ఫరీద్ అహ్మద్ ద్వారా ఖమ్మంలో ఆబిద్ గది అద్దెకు తీసుకున్నాడు. కాగా, ఆబిద్‌తో వివాహేతర సంబంధం సాగిస్తున్న హుస్సేన్‌బీ ద్వారా నేలకొండపల్లి మండలం బుద్దారానికి చెందిన జమాల్‌బీ, ఆమెతో పైనంపల్లికి చెందిన షేక్ షబానా పరిచయమైంది. కాగా, షబానా ప్రస్తుతం అనంతగిరి మండలం తమ్మరబండపాలెంలో ఉంటోంది. ఆమెతో కూడా ఆబిద్ వివాహేతర సంబంధం ఏర్పర్చుకున్నాడు.

హత్యకు పథకం సిద్ధమైంది ఇలా...

ఒకేసారి రూ.లక్షలు సంపాదిస్తే విలాసవంతంగా జీవనం గడపొచ్చని, అందుకు దోపిడీ సరైన మార్గమని షబానాకు ఆబిద్ చెప్పగా ఆమె తన మేనత్త జమాల్‌బీకి చెబితే ఆమె సైతం అంగీకరించింది. అయితే, ధనవంతులై ఒంటరిగా ఉండే వారి వివరాలు చెప్పాలని కోరగా ఆమె ఆరు నెలల క్రితం నేలకొండపల్లిలోని కొత్తకొత్తూరుకు చెందిన రేషన్ బియ్యం వ్యాపారం చేసే వెంకటరమణ పేరు సూచించింది. వృద్ధుడైన ఆయన భార్యతో ఉంటాడని, దోపిడీ చేయడం సులువని చెప్పింది. అనంతరం కోదాడలో ఉన్న హుస్సేన్‌బీ, గే అయిన సురేష్‌ను పిలిపించి వారినీ ఒప్పించాడు. ఆపై ఖమ్మంలో సెల్‌ఫోన్ సిమ్‌లు విక్రయించే మణికంఠతో పరిచయం పెంచుకుని డబ్బు ఆశ చూపి ఎలాంటి ఆధారాలు లేకుండా 10 సిమ్ కార్డులు, ఇంకో చోట ద్విచక్రవాహనం కొనుగోలు చేశాడు. అయితే, ఇంకో వాహనం నంబర్ ప్లేట్ చోరీ చేసి తాను కొన్న వాహనానికి అమర్చాడు. ఇంతలోనే నేలకొండపల్లిలోని వెంకటరమణ ఇంట్లో ఓ పోర్షన్ ఖాళీగా ఉండగా సురేష్‌ను పంపించగా ఆయన తన కుటుంబం మూడు నెలల తర్వాత వస్తుందని చెప్పినా వెంకటరమణ అద్దెకు ఇవ్వలేదు. ఆతర్వాత హుస్సేన్‌బీ, షబానాను పంపగా వారికి ఇల్లు అద్దెకు ఇచ్చాడు. ఆతర్వాత మణికంఠ వద్ద మరో ఐదు సిమ్‌లను తీసుకోగా.. హుస్సేన్‌బీ, షబానాలు వెంకటరమణ, కృష్ణ కుమారితో పరిచయం పెంచుకుని తరచూ వారి ఇంట్లో టీవీ చూస్తూ భోజనం చేసేవారు. వృద్ధ దంపతుల వద్ద భారీగా బంగారం, డబ్బు ఉందనే భావనతో నవంబర్ 25వ తేదీన రాత్రి ఆబిద్, సురేష్‌లు షబానా, హుస్సేన్‌బీ ఉంటున్న పోర్షన్‌లోకి ప్రవేశించారు. కానీ ఆరోజు హత్య చేయడం కుదరలేదు. మరుసటి రోజు 26వ తేదీన రాత్రి వెంకటరమణ ఇంట్లోకి వెళ్లిన షబానా, హుస్సేన్‌బీ టీవీ చూస్తూ కృష్ణకుమారితో మాటలు కలిపారు. ఆపై ఆబిద్, సురేష్ ఇంట్లోకి జొరబడి షబానా, హుస్సేన్‌బీ సహకారంతో కృష్ణకుమారి గొంతు పిసికి హత్య చేశారు. ఆతర్వాత ఆమె ఒంటిపై ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు దొంగిలించారు. అనంతరం ఇంట్లో బంగారు, డబ్బుకోసం వెతుకుతుండగా శబ్దానికి నిద్ర లేచిన వెంకటరమణ పక్క గది నుంచి రావడంతో ఆయననూ హత్య చేశారు.

రాత్రంతా అక్కడే..

దంపతులను హత్య చేశాక బయటకు వెళ్తే పోలీసులకు పట్టుబడతామని భావించి నిందితులంతా ఇంట్లోనే గడిపారు. డాగ్ స్క్వాడ్‌కు వాసన పసిగట్టకుండా ఇంటి చుట్టూ, మృతదేహాల వద్ద కారం పొడి చల్లాడు. ఇక 27న తెల్లవారుజామున ఆబీద్ బైక్‌పై హుస్సేన్‌బీ, షబానాను తీసుకెళ్లి ఆటోలో ఖమ్మం పంపించాడు. అనంతరం సురేష్‌కు బంగారంలో కొంత, నగదు కొంత ఇచ్చి కోదాడకు పంపాడు. ఆతర్వాత ఖమ్మం వెళ్లిన ఆబీద్ పాత బస్టాండ్ వద్ద హుస్సేన్‌బీ, షబానాతో ఖమ్మంలో తాను ఉండే గదికి వెళ్లాడు. రెండు రోజుల పాటు కూడా వారు నేలకొండపల్లికి వచ్చివెళ్తూ ఏం జరుగుతుందో తెలుసుకున్నాడు. ఆపై ఉన్న బంగారాన్ని అమ్మితే వాటా ఇస్తానని హైదరాబాద్‌లో ఉన్న స్నేహితుడైన ఫరీద్‌కు చెప్పాడు. దీంతో ఆయన ఖమ్మంలోని స్టోన్‌క్రషర్‌లో పనిచేసే విజయ్‌నగర్‌కాలనీకి చెందిన అనుమోల అనిల్‌కుమార్‌ని పరిచయం చేయడంతో ఆయనకు వాటా ఇస్తామని నమ్మబలికి బంగారం అమ్మాలని అప్పగించారు.

ఇలా చిక్కారు...

దంపతుల హత్య కేసును ఛేదించేందుకు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి ఆధ్వర్యాన 45 మంది సిబ్బందితో ఐదు బృందాలను నియమించారు. దీంతో వారు అన్ని కోణాల్లో పరిశీలిస్తూ అనుమానం ఉన్న ప్రతీ ఒక్కరిని విచారించారు. మృతుడు వెంకటరమణకు ఫోన్ చేసిన వారి నంబర్ల ఆధారంగా 15 సిమ్‌ల కాల్‌డేటా వెలికితీశారు. దీంతో ఆబిద్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా విషయం బయటపడింది. ఈమేరకు ఎనిమిది మందిని అరెస్ట్ చేసి ఎనిమిది తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాగా, కేసు విచారణలో కీలకంగా వ్యవహరించిన ఉద్యోగులను సీపీ అభినందించి రివార్డులు ప్రకటించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ ఇంటి అద్దె కోసం వచ్చే వారి పూర్తి వివరాలు తెలుసుకోవాలని, అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కాగా, ఈ కేసు విచారణ ఇంకా కొనసాగుతోందని తెలిపారు. ఈసమావేశంలో ఏసీపీ తిరుపతిరెడ్డి, కూసుమంచి సీఐ సంజీవ్, ఎస్‌ఐలు జగదీష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తీవ్రవాదుల దాడుల్లో బలైన సిబ్బందికి ఎంపీ నివాళి



నివాళులర్పిస్తున్న ఎంపీ రవిచంద్ర

ఖమ్మంమయూరిసెంటర్: పార్లమెంట్‌పై 2001 డిసెంబర్ 13న తీవ్రవాదులు జరిపిన దాడిలో మృతి చెందిన పార్లమెంట్, భద్రతా సిబ్బందికి బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ ఉప నేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర నివాళులర్పించారు. ఈమేరకు శుక్రవారం పార్లమెంట్ ఆవరణలో అమరుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు.

నేడు, రేపు యూటీఎఫ్ జిల్లా మహాసభలు

సత్తుపల్లి: టీఎస్ యూటీఎఫ్ జిల్లా మహాసభలు శని, ఆదివారం సత్తుపల్లిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.నాగమల్లేశ్వరరావు, పి.నాగేశ్వరరావు తెలిపారు. సత్తుపల్లిలో ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించిన వారు మాట్లాడారు. సభల్లో భాగంగా నూతన ప్రాంతీయ కార్యాలయాన్ని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి శనివారం ప్రారంభిస్తారని తెలిపారు. అలాగే, మహాసభకు మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి హాజరవుతారని వెల్లడించారు.

రేపు క్రాస్ కంట్రీ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి క్రాస్‌కంట్రీ ఎంపిక పోటీలను ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ఈనెల 15వ తేదీన నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎం.డీ.షఫీక్ అహ్మద్ తెలిపారు. అండర్–16, 18, 20తో పాటు సీనియర్ పురుషులు, మహిళ విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్‌కార్డుతో హాజరుకావాలని, ఇక్కడ ప్రతిభ చాటిన క్రీడాకారులను ఈనెల 22న నాగర్‌కర్నూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి క్రాస్‌కంట్రీ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

తప్పులు లేకుండా యాప్‌లో వివరాల నమోదు



కార్యదర్శులకు సూచనలు చేస్తున్న డీపీఓ ఆశాలత

ముదిగొండ: ఇందిరమ్మ ఇళ్ల కోసం అందిన దరఖాస్తుల ఆధారంగా చేపడుతున్న సర్వేలో సేకరించిన వివరాలను తప్పులు లేకుండా యాప్‌లో నమోదు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత సూచించారు. మండలంలోని న్యూలక్ష్మీపురం, చిరుమర్రి, పమ్మి గ్రామాల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా డీపీఓ గ్రామాల్లో దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి సమగ్రంగా వివరాలు సేకరించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీఓ వాల్మీకి కిషోర్, పంచాయతీ కార్యదర్శులు సురేష్, నరేష్, రాధిక పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు టీవీలు



టీవీలు అందజేస్తున్న ఫౌండేషన్ బాధ్యులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరంలోని కొత్తగూడెంలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు ఎస్‌ఆర్‌ఐ ఫౌండేషన్ ఆధ్వర్యాన టీవీలు అందజేశారు. కొత్తగూడెం పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఫౌండేషన్ బాధ్యులు బోనాల రామకృష్ణ, పసుమర్తి రంగారావులు అంగన్‌వాడీ టీచర్లు ఉమ, శైలజ, లక్ష్మికి రూ.20 వేల చొప్పున విలువైన మూడు టీవీలు అందజేసి మాట్లాడారు. చిన్నారులకు విద్యా, విజ్ఞానపరంగా ఉపయోగపడేలా టీవీలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు రమాదేవి, లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు నర్మద, బండి నాగేశ్వరరావు, సూర్యకుమారి, ప్రవీణ పాల్గొన్నారు.

అతిగా మద్యం సేవించిన వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం: ఖమ్మం పత్తి మార్కెట్ వద్ద ఓ వ్యక్తి అతిగా మద్యం సేవించి మృతి చెందాడు. విజయవాకు చెందిన బొమ్మరిల్లు రమేష్(37) వంటమనిషిగా పనిచేస్తూ ఖమ్మం మార్కెట్ ప్రాంతంలో లక్ష్మిని వివాహం చేసుకున్నాడు. విపరీతంగా మద్యం సేవించే ఈయన రెండు రోజుల క్రితం భార్యతో గొడవపడి విజయవాడకు వెళ్లి గురువారం వచ్చాడు. శుక్రవారం ఉదయమే మద్యం తాగిన ఆయన మార్కెట్ సమీపంలో పడి పోయి అక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని రాత్రి గుర్తించగా అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు సాయంతో మృతదేహన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసినట్లు ఖమ్మం త్రీ టౌన్ సీఐ రమేష్ తెలిపారు.

సమాఖ్య స్ఫూర్తికి 'జమిలీ' విరుద్ధం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

ఖమ్మంమయూరిసెంటర్: జమిలీ ఎన్నికలు నిర్వహించాలనే కేంద్రప్రభుత్వం నిర్ణయం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఈ విధానంతో లాభాల కంటే నష్టాలే ఎక్కువ ఉన్నాయని చెప్పారు. సీపీఐ జిల్లా సమితి సమావేశం శుక్రవారం ఖమ్మంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో రావి శివరామకృష్ణ అధ్యక్షతన నిర్వహించగా కూనంనేని మాట్లాడారు. ఒకే దేశం - ఒకే ఎన్నిక విధానంతో ప్రాంతీయ పార్టీల హక్కులకు భంగం కలిగే అవకాశమున్నందున తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. కాగా, పార్టీలను చీల్చడం ప్రాంతీయ పార్టీలను దెబ్బతీయడం ద్వారా బీజేపీ రాష్ట్రాల్లో గెలుపు సాధిస్తోందని చెప్పారు. ఈనేపథ్యాన కమ్యూనిస్టుల అవసరాన్ని ప్రజలు గుర్తిస్తున్నందున వామపక్ష ప్రజాతంత్ర శక్తులు ఐక్యంగా పనిచేయాలని సూచించారు. పార్టీ శతజయంతోత్సవాల ప్రారంభసభ ఈనెల 30న నల్లగొండలో, జాతీయ స్థాయి ముగింపు సభ 2025 డిసెంబర్ 26న ఖమ్మంలో జరగనుందని కూనంనేని తెలిపారు. ఇటీవల మృతి చెందిన సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, పలువురు నాయకుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. ఈ సమావేశంలో నాయకులు బాగం హేమంతరావు, దండి సురేష్, మహ్మద్ మౌలానా పాల్గొన్నారు.

అసెంబ్లీలో ప్రస్తావిస్తా..

ఖమ్మం సహకారనగర్: విద్యాశాఖలోని సమగ్ర శిక్షా అభియాన్(ఎస్‌ఎస్‌ఏ) ఉద్యోగుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. కలెక్టరేట్ వద్ద ధర్నాచౌక్‌లో ఉద్యోగుల సమ్మె శిబిరాన్నిసందర్శించిన ఆయన మాట్లాడారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, పీఆర్‌టీయూ ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధ్యక్షులు వై.వెంకటేశ్వర్లు, డి.వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, కోశాధికారి రాంబాబు తదితరులు కూడా మద్దతు ప్రకటించారు. ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝాన్సీసౌజన్య, జిల్లా అధ్యక్షుడు షేక్ మహబూబ్ పాషా మాట్లాడగా రామాంజనేయులు, అనిల్, విజయలక్ష్మి, సాంబశివరావు, మదార్, సైదులు, నిర్మల, ఇస్మాయిల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రైవేటీకరణకు నిరసనగా ధర్నా



ఎస్‌ఈ కార్యాలయం ధర్నాలో ఇంజనీర్లు, ఉద్యోగులు

ఖమ్మంవ్యవసాయం: ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించడాన్ని నిరసిస్తూ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ, నేషనల్ కోఆర్డినేషన్ ఆఫ్ ఇంజనీర్లు, ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యాన శుక్రవారం నిరసన తెలిపారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఖమ్మం ఎస్‌ఈ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరిస్తే వినియోగదారులపై భారం పెరగడమే కాక గృహ, పరిశ్రమలు, రైతులకు సబ్సిడీలు ఎత్తివేస్తారని తెలిపారు. అంతేకాక ఉద్యోగులు, కార్మికులు హక్కులను కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డీఈటీ బాబూరావు, సివిల్ ఇంజనీర్ల జేఏసీ కన్వీనర్ హీరాలాల్, 327 జిల్లా అధ్యక్షుడు మందపాటి సత్యనారాయణరెడ్డి, సీఐటీయూ కంపెనీ కార్యదర్శి ఎం.ప్రసాద్‌తో పాటు కిరణ్‌చక్రవరి, నాగమల్లేశ్వరరావు, ఖాదర్ బాబా, నాగేశ్వరరావు, తిరుపతి, జగన్, యుగంధర్, వేణు, జయప్రకాష్, వెంకన్న, ఉపేందర్, నాగేందర్, పుష్పరాణి, రజిని, మానస తదితరులు పాల్గొన్నారు.

బోనస్ కోసం ఏపీ నుంచి ధాన్యం తరలింపు

చెరువుమాధారం వద్ద లారీలను అడ్డుకున్న స్థానికులు

నేలకొండపల్లి: తెలంగాణలో సన్నధాన్యానికి మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ చెల్లిస్తుండడంతో ఇదే అదునుగా అక్రమార్కులు రంగప్రవేశం చేశారు. ఏపీలోని మచిలీపట్నం, గుంటూరు, విజయవాడ, తెనాలి తదితర ప్రాంతాల దళారులు లారీల ద్వారా సన్న రకం ధాన్యాన్ని ఇక్కడకు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ఈమేరకు నేలకొండపల్లి మండలంలో వివిధ గ్రామాలకు పెద్దసంఖ్యలో లారీలు వస్తుండడంతో అనుమానించిన స్థానికులు శుక్రవారం చెరువుమాధారం వద్ద లారీలను అడ్డుకున్నారు. మరోమారు ఇటువైపు రామని చెప్పడంతో వదిలేయగా.. ఘటనపై రెవెన్యూ, పోలీస్, సివిల్ సప్లయీస్ అధికారులకు సొసైటీ మాజీ చైర్మన్ ఈవూరి శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు చేశారు. ఏపీకి జిల్లాలోని పలు ప్రాంతాలు సరిహద్దుగా ఉండడంతో ముదిగొండ మండలంలోని వల్లభి, నేలకొండపల్లి మండలంలోని పైనంపల్లి చెక్‌పోస్టు మీదుగా సూర్యాపేట జిల్లాకు భారీగా ధాన్యాన్ని లారీల ద్వారా తరలిస్తున్నారు. చెరువుమాధారం, అజయ్‌తండా మీదుగా ప్రతీరోజు 40 నుంచి 50 లారీల ధాన్యం వెళ్తున్నట్లు తెలిసింది. ఒక్కో లారీలో 350 నుంచి 400 క్వింటాళ్ల ధాన్యం రవాణా చేస్తుండగా ఒక్క లారీకి బోనస్ కింద రూ.2 లక్షల వరకు సొంతం చేసుకుంటున్నట్లు సమాచారం. కాగా, గురువారం ఒకేరోజు పైనంపల్లి చెక్‌పోస్టు వద్ద రూ.లక్ష సెస్ చెల్లించారంటే పరిస్థితులుఅర్థం చేసుకోవచ్చు. అయితే, ఇక్కడ ధాన్యం అమ్మేందుకు స్థానిక రైతులు వివరాలు సమర్పించాల్సి ఉండడంతో ఏపీ దళారులు స్థానిక అధికారులు, లేదా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సాయం తీసుకుని వారికి కొంత ముట్టచెబుతున్నట్లు తెలుస్తోంది. కాగా, తనిఖీలు తప్పించుకునేందుకు ముదిగొండ మండలంలోని వల్లభి, నేలకొండపల్లి మీదుగా కోదాడకు ధాన్యం తరలిస్తున్నట్లు సమాచారం.

ఉత్పత్తిలో అగ్రస్థానాన నిలవాలి



సీహెచ్‌పీ వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న జీఎం సుభాని

సత్తుపల్లిరూరల్: సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడంలో కొత్తగూడెం ఏరియా ముఖ్యపాత్ర పోషించాలని సింగరేణి కోఆర్డినేషన్ జీఎం ఎస్‌డీఎం .సుభాని అన్నారు. సత్తుపల్లి మండలం జేవీఆర్ ఓసీ, సీహెచ్‌పీలను శుక్రవారం సందర్శించిన ఆయన బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలు తెలుసుకున్నారు. అనంతరం జీఎం మాట్లాడుతూ లక్ష్యం మేరకు ఉత్పత్తి చేస్తూనే జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. రానున్న వేసవిలో థర్మల్ కేంద్రాలకు డిమాండ్ మేర బొగ్గు సరఫరా చేసేలా ఇప్పటి నుంచే దృష్టి సారించాలని చెప్పారు. ఓసీల పీఓలు ప్రహ్లాద్, నర్సింహారావు, డీజీఎం సీహెచ్‌పీ కె.సోమశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో నూరు శాతం ఫలితాల సాధనే లక్ష్యం

సత్తుపల్లిటౌన్: ఈ విద్యాసంవత్స రం ఇంటర్‌మీడియట్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాశాఖాధికారి రవిబాబు సూచించా రు. సత్తుపల్లిలోని బండి శోభనాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించిన డీఐఈఓ.. ఆతర్వాత అధ్యాపకులతో సమావేశమయ్యారు. విద్యార్థుల మానసిక ప్రవర్తనను గమనిస్తూ స్టూడెంట్ కౌన్సిలర్లను నియమించాలని, తరచుగా గైర్హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడడమే ప్రత్యేక తరగతులు బోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బాటలోనే కాంగ్రెస్..



మాట్లాడుతున్న బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

ఖమ్మం మయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఖమ్మంలో మిర్చి రైతులకు బేడీలు వేస్తే ఇప్పుడు అదే బాటలో కాంగ్రెస్ ప్రభుత్వం లగచర్ల కేసులో రైతులకు బేడీలు వేసిందని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. ఈ ఘటనపై నిరసన శుక్రవారం ఖమ్మంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద ధర్నా నిర్వహించి ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న రైతును ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమాన చేతికి బేడీలు వేయడం గర్హనీయమన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయకపోగా వారి చేతుల బేడీలు వేయడం సిగ్గుచేటని చెప్పారు. ఈకార్యక్రమంలో నాయకులు సోమగాని ఎల్లారావు గౌడ్, వల్లభనేని పుల్లయ్య, అనంత ఉపేందర్, నకిరేకంటి వీరభద్రం, మందా సరస్వతి మందడపు ప్రభాకర్‌రెడ్డి, ధనియాకుల వెంకటనారాయణ, నెల్లూరు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

15న ఖమ్మంలో రైతు అవగాహన సదస్సు

ఖమ్మంవ్యవసాయం: సాగులో లాభసాటి విధానాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 15వ తేదీ (ఆదివారం)న సమావేశం నిర్వహిస్తున్నట్లు సంయుక్త కిసాన్ మోర్చా నాయకుడు నల్లమల వెంకటేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎకరం భూమిలో రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల ఆదాయం గడించేలా ఐదంచెల కూరగాయల సాగు, ఆకుకూరల సాగుపై సేవ్ సంస్థ వ్యవస్థాపకుడు విజయ్‌రామ్ వివరిస్తారని తెలిపారు. ఈ సదస్సులో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రైతులు డాక్టర్ చలాంల నాగేశ్వరరావు, కుడుముల వెంకట్రాంరెడ్డి, మాధవి, కమ్మ మహాజన సంఘం నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, సైదుబాబు పాల్గొన్నారు.

డబుల్ రిజిస్ట్రేషన్‌పై కేసు

రఘునాథపాలెం: మండలంలోని కోటపాడుకు చెందిన ఒక రైతు తన వ్యవసాయ భూమిని ఇద్దరికి రిజిస్ట్రేషన్ చేసిన ఘటనలో చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు. భద్రాది కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు చెందిన శ్రావణ్‌కుమార్ 2015లో కోటపాడులో కొంటిముక్కల వెంకటేశ్వర్లు వద్ద మూడెకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఆ భూమిని వెంకటేశ్వర్లుకే కౌలుకు ఇస్తుండగా అనారోగ్యం కారణంగా శ్రావణ్‌కుమార్ భూమి వద్దకు రాలేదు. దీంతో 2018లో ధరణి ఏర్పాటైన సమయాన వెంకటేశ్వర్లు భూమిని తిరిగి తన పేరిట నమోదు చేయించుకుని పట్టాదారు పాస్‌పుస్తకం పొందాడు. ఆపై శివాయిగూడేనికి చెందిన సీహెచ్ ప్రదీప్‌కుమార్‌కు అమ్మి రిజిస్ట్రేషన్ చేశాడు. ఈ విషయం శ్రావణ్‌కుమార్‌కు ఇటీవల తెలియడంతో ఆయన వద్ద పనిచేసే వి.వెంకటాయపాలెంనకు చెందిన మూడ్ శంకర్‌తో ఫిర్యాదు చేయించగా వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



సాక్షి క్లాసిఫైడ్స్

Services

- మీ బంగారం మణప్పురం, ముత్తూట్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 9177555694 [SCA24000795]

Wanted

- Universal యాడ్స్ కంపెనీకి మొబైల్‌లో SMSలు పంపుతూ వారానికి 5000 నుండి 6000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418 [M-1256003]
- హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్. జీ: 18K. Ph: 9640468899, 9640258899 [SCA24000827]
- సిగ్నేచర్ ఫిలిం సిటీలో పని చేయుటకు సివిల్ ఇంజనీర్, వీడియో ఎడిటర్స్, డిఓపి కెమెరా మెన్, రిసెప్షనిస్ట్, కార్ డ్రైవర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, వెబ్‌సైట్ డిజైనర్స్, యాప్ డెవలపర్స్ కావలెను. 93931 31111. [M-1256002]
- Hyderabad Meds Pharmacy. మా ఫార్మసీలో (ఖమ్మంలో) Pharmacist (with PCI) Pharma Aid మరియు any Medical Experience కలిగిన యువతీ, యువకులు కావలెను. వివరాలకు సంప్ర. సెల్: 79898 50856, 89780 23734 [M-1185442]

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	9010299957, 9705444182
కొత్తగూడెం	9010223783
పాల్వంచ	9705444183
భద్రాచలం	9951602914
మణుగూరు	9705944416
సత్తుపల్లి	9652868642
మధిర	9949927792

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి కేవలం రూ. 500/- మాత్రమే (GST 5% అదనం)

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.